మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# ఎంఎస్ఆర్, మల్లు నర్సింహారెడ్డి కృషితోనే విజయం

- అందరి సమన్వయంతో చారిత్రక గెలుపు
- ఆధిపత్యాన్ని చాటిన ప్రజా తీర్పు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- మహబూబ్‌నగర్‌లో సర్పంచుల అభినందన సభ

**మహబూబ్‌నగర్‌బ్యూరో, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** హన్వాడ మండలంలో సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి.మహేందర్‌తో సమన్వయంతో అదేవిధంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి మహబూబ్‌నగర్ మండలంలో పార్టీ బాధ్యతలను తన భుజస్కంధాలపై మోసి విజయంలో కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా బలం, కార్యకర్తల ఐక్యత, నాయకత్వ సమన్వయానికి నిదర్శనంగా సర్పంచ్ ఎన్నికల్లో సాధించిన ఘన విజయం చారిత్రాత్మకమని యెన్నం స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు నిర్వహించిన అభినందన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ



సర్పంచుల అభినందన సభలో ఎమ్మెల్యే యెన్నం, సంజీవ్ ముదిరాజ్

నిరంతరం ప్రజల మధ్య ఉంటూ చేసిన పోరాటాలు, ఉద్యమాలు, సంక్షేమ డిమాండ్ల ఫలితమే ఈ విజయం అని తెలిపారు. మహబూబ్‌నగర్, హన్వాడ మండలాల్లోని – మిగతా3లో..



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

# ప్రలోభాలకు భయపడొద్దు

- సర్పంచుల గెలుపు.. రేపటి అధికారానికి పునాది
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- సర్పంచులకు ఆత్మీయ సన్మానం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** అధికార పార్టీ సర్పంచులకే నిధులు వస్తాయని భ్రమలు కొందరిలో ఉంటాయని, బీజేపీ సర్పంచులు ప్రలోభాలకు భయపడాల్సిన అవసరం లేదని ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా సర్పంచ్ ల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డులుగా గెలుపొందిన సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన వాటికి కూడా కష్టపడి పని చేసినందుకు అభినందనలు తెలిపారు. బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛమైన పాలన చేస్తారు అనే విశ్వాసం సంపాదించుకోవాలన్నారు. ఒకవైపు రూలింగ్ పార్టీ, మరోవైపు మొన్నటివరకు రూలింగ్‌లో ఉన్న పార్టీలను రెండింటితో ఢీ కొట్టి బీజేపీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గెలిచారని ఇది గొప్ప పరిణామమన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో అనేక అంశాలు ప్రభావం – మిగతా3లో..

### ప్రజలకు చేరువ చేయాలని

# లోక్ భవన్‌గా పేరు మార్పు

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- కవులు, కళాకారులకు పిలుపు
- జోగుళాంబ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఐదో శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు



**గద్వాల, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కవులు, కళాకారులు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. మంగళవారం గద్వాల ఐడీఓసీ సమావేశ హాల్‌లో జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ అలంపూర్ శ్రీ జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన క్షేత్రమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వికసిత భారత్ జాతీయ స్లోగన్ గా పేర్కొంటూ ప్రజలందరూ దేశాభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. వికసిత్ భారత్ దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్య అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొంటూ, విద్యా రంగంలో గుణాత్మక అభివృద్ధి సాధించి, జిల్లాలో ఉత్తమ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. టీబీ ముక్త భారత్ కార్యక్రమను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని, భవిష్యత్తులో వాటిని ఇంకా మెరుగ్గా నిర్వహించి మరింత ఎక్కువగా రక్తదాన కార్యక్రమాలు చేపట్టాలని గవర్నర్ సూచించారు. జిల్లా పరిపాలన యంత్రాంగం పనితీరు ప్రశంసనీయంగా ఉందని, భవిష్యత్తులో ఎదురయ్యే కొత్త సవాళ్లకు నూతన పరిష్కారాలు కనుగొని ప్రజల సంక్షేమానికి మరింత కృషి చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా భౌగోళిక వివరాలు, చరిత్ర, ప్రసిద్ధ ఆలయాలు, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి, వివిధ శాఖల సంక్షేమ పథకాల అమలు గురించి గవర్నర్ కు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం గవర్నర్ కు గద్వాల చేనేత పట్టు చీర ఫ్రేమ్ ను జ్ఞాపికగా అందజేశారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జ్ఞాపికను బహుకరించారు. పలువురు ప్రజాప్రతినిధులతోపాటు వివిధ రంగాల ప్రముఖులు గవర్నర్ కు వినతి పత్రాలు అందజేశారు. అంతకుముందు అలంపూర్ నుంచి కలెక్టరేట్ కు చేరుకున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు జిల్లా అధికార యంత్రాంగం, పలువురు ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. గద్వాల బాల భవన్ చిన్నారులు స్వాగతం పలుకుతూ చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఇక్కడి ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను గవర్నర్ సందర్శించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు. ఇతర కార్యక్రమాల వివరాలను తెలుసుకొని నిర్వాహకులను ప్రశంసించారు. మెప్మా. సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లు పరిశీలించి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి వ్యాపారాల్లో రాణించడం అభినందనీయమన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్ లో టి.బి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం గురించి నిర్వాహకులు గవర్నర్ కు తెలియజేశారు. నషా ముక్త భారత్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన స్టాల్లు పరిశీలించారు. చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మగ్గం, రాట్నం పరిశీలించి చేనేత కార్మికుల పనితీరును ప్రశంసించారు. గద్వాల చీరల ప్రత్యేకత, ఇతర వివరాలను క్షుణ్ణంగా చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఆయా స్టాల్స్ నిర్వాహకులు గవర్నర్ కు గౌరవార్థం వివిధ హస్త కళా వస్తువులను బహుకరించారు. అనంతరం కలెక్టరేట్ గార్డెన్ లో గవర్నర్ మొక్కను నాటారు. చివరగా జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కు జిల్లా కలెక్టర్ బి యం సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే విజయుడు, తదితర అధికారులు పుష్పగుచ్ఛలు, పూల మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గద్వాల పట్టణంలోనీ హరిత హోటల్ లో గౌవర్నర్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, గవర్నర్‌కు సంయుక్త కార్యదర్శి జె.భవానీ శంకర్, గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అలంపూర్ శాసన సభ్యులు విజయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, గవర్నర్‌కు ఏడీసీ మేజర్ అమన్ కుందూ, ఏడీసీ కాంతిలాల్ పటేల్, సీఎస్ఓ ఎల్.శ్రీనివాస రావు, గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి పవన్ సింగ్, అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ రావు, ఆర్డీవో అలివేలు, డిఎస్పీ మొగలయ్య, పురావస్తు శాఖ ఇంజనీర్ కిశోర్ కుమార్ రెడ్డి, ఆర్డీవో అలివేలు, ఈ.ఓ దీప్తి, తహసీల్దార్ మంజుల, హార్టికల్చర్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.



బహుమానం అందజేస్తున్న ఎమ్మెల్యే



జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో గ్రూప్ ఫొటో దృశ్యం



పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



చేనేత స్టాల్ ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

### టైగర్ రిజర్వ్ గ్రామాల పునరావాసం

# పారదర్శకంగా పూర్తి చేయాలి

- పునరావాసం అంటే సంపూర్ణ జీవన వ్యవస్థ,
- గ్రామాల పునరావాసంలో అన్ని శాఖల సమన్వయం అవసరం
- నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ దేశానికి తలమానికంగా నిలుస్తోందని, దాని ప్రత్యేకతను కాపాడుకుంటూనే టైగర్ రిజర్వ్ పరిధిలోని తరలింపు గ్రామాల పునరావాసం, పునర్నిర్మాణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని నాగర్‌కర్నూల్‌జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అటవీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్‌జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కోర్ అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాల పునరావాస–పునర్నివాస ప్రక్రియపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్, జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర పాల్గొన్నారు. అమ్రాబాద్ టైగర్‌రిజర్వ్ పరిధిలోని కొల్లంపెంట, సర్లపల్లి, కుడిచింతల బైలు, తాటిగుండల పెంట గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చేపడుతున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల తరలింపు – మిగతా3లో..



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

# విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్23, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న అపెక్స్ సెంట్రల్ స్కూల్, రాజేంద్రనగర్‌లోని న్యూ రిషి హైస్కూల్, భగీరథ కాలనీలో గల మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్లలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తన స్వంత ఖర్చులతో డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను పదవతరగతి చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. డిజిటల్ కంటెంట్ ద్వారా విద్య మరింత సులభంగా, సమగ్రంగా అర్థమవుతుందని, ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, డిజిటల్ స్టడీ మెటీరియల్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకుంటే – మిగతా3లో..

# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లాలో 2.20 కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం
- నల్ల చెరువులో లక్ష చేప పిల్లల విడుదల
- వనపర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ప్రారంభంలోఎమ్మెల్యే తుడి మేగారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగానే వనపర్తి జిల్లాలో 2.20కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్లచెరువులో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో



నల్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్

నిర్వహించిన చేప పిల్లల విడుదల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు జిల్లా మత్స్యకార సహకార సంఘాల నాయకులతో కలిసి నల్లచెరువులో లక్ష చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మేఘా రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగానే వనపర్తి జిల్లాలో 2.20కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. నల్ల చెరువులో ఈరోజు లక్ష చేప పిల్లలను విడుదల చేసి, జిల్లాలో ఈ ప్రక్రియను ప్రారంభించుకోవడం జరుగుతుందని అన్నారు. చేపల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలోని –మిగతా3లో..



ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

# మక్తల్ పట్టణంలో మంత్రి బైక్ ర్యాలీ

- వార్డుల వారీగా సుడిగాలి పర్యటన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక, యువజన సర్వీస్‌ల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి సుడిగాలి పర్యటన చేశారు. ఉదయమే బైక్ పై బయలుదేరి పట్టణంలోని పలు వార్డుల్లో ప్రతీ గల్లీ తిరిగి తనే స్వయంగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో చేపట్టవలసిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు పలు అభివృద్ధి పనులపై అధికారులకు వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని ప్రజలకు భరోసా ఇచ్చారు. వార్డులో కలియదిరుగుతున్న మంత్రిని మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఆప్యాయంగా పలకరించారు. ప్రతి ఇంటిలో అందరిని పలకరించి వారి బాగోగుల గురించి మంత్రి శ్రీహరి అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో సమస్యలు తెలుసుకోవడానికి ఉదయాన్నే మంత్రి పర్యటించడం – మిగతా3లో..



పర్యటన చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

# 8పాఠశాలలు రాష్ట్రస్థాయికి..

- స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్
- ప్రశంసా పత్రాలు అందజేసిన కలెక్టర్ విజయేంద్ర బోయి



అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ కార్యక్రమంలో మహబూబ్‌గర్ జిల్లాలో మొత్తం 1136 విద్యాసంస్థలు స్వీయ మూల్యాంకనంలో పాల్గొన్నాయి. ఇందులో 343 పాఠశాలలు 4 స్టార్, 5 స్టార్ రేటింగ్ సాధించి బాహ్య మూల్యాంకనం చేయడానికి అర్హత సాధించాయి. ఈ బాహ్య మూల్యాంకనంలో నలభై మంది సముదాయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ 343 పాఠశాలలను సందర్శించి బాహ్య మూల్యాంకనం చేశారు. ఇందులో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 పాఠశాలలను కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విద్యాశాఖ అధికారితో కూడిన జిల్లా హై లెవెల్ కమిటీవివిధ కేటగిరిలలో జిల్లా స్థాయికి ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి నామినేట్ చేశారు. రాష్ట్రస్థాయిలో కూడా ఈ పాఠశాలలు మంచి మార్కులు సాధిస్తే జాతీయ స్థాయికి ఎంపిక అవుతాయి. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన 200 పాఠశాలలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం లక్ష రూపాయల నగదు అందజేస్తారు. మనజిల్లా నుంచి – మిగతా3లో..

**జిల్లా స్థాయిలో ఎంపికై రాష్ట్రస్థాయికి నామినేట్ చేయబడిన 8 పాఠశాలలు**

**విభాగం 1 రూరల్ పాఠశాలలు..**

1. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొంరెడ్డిపల్లి , గండీడ్ మండల్.
2. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కంచన్‌పల్లి , మహమ్మదాబాద్ మండల్
3. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కల్లేపల్లి, రాజాపూర్ మండలం

**విభాగం 2 రూరల్ పాఠశాలలు..**

1. ఎస్‌వీకేఎం పాఠశాల, సెజ్ పోలేపల్లి జడ్చర్ల మండలం.
2. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్ )వెన్నచెడ్, గండీడ్ మండల్
3. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాటికొండ, భూత్పూర్ మండలం

విభాగం 1 అర్బన్ పాఠశాల 1.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బాదేపల్లి (తెలుగువాడ)

విభాగం 2 అర్బన్ పాఠశాల 1. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏదిర, మహబూబ్‌గర్ అర్బన్ మండలం



డీటీఓ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

# మహబూబ్‌గర్‌లో ఏసీబీ రైడ్స్

- డీటీవో అక్రమాస్తులపై ఫిర్యాదులు
- పలుచోట్ల అధికారుల సోదాలు

**మహబూబ్‌గర్ బ్యూరో డిసెంబర్23 ప్రభాతవార్త :** మహబూబ్‌గర్‌లో ఏసీబీ రైట్స్ కలకలం రేపాయి. మహబూబ్‌గర్ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్(డిటిఓ) కిషన్ నాయక్ నివాసంతో పాటు ఏసీబీ అధికారులు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అక్రమాస్తుల విషయంలో కిషన్ నాయక్ పేరుమీద ఇప్పటికే కేసు నమోదైన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యుల ఇండ్లపై కూడా ఏకకాలంలో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. కిషన్ నాయక్‌కు రూ.100కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అందినఫిర్యాదుమేరకు మహబూబ్‌గర్‌తో పాటు జంటనగరాల్లో సోదాలునిర్వహించినట్లు తెలిసింది.



జోగుళాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

# ఐదోశక్తి పీఠంలో గవర్నర్

**గద్వాల, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** అష్టాదశ శక్తిపీఠాలలో 5వ శక్తిపీఠమైన అలంపూర్ శ్రీ జోగులాంబ దేవస్థానాన్ని, బాలబ్రహ్మేశ్వర దేవాలయాలను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం సందర్శించి జోగుళాంబ అమ్మవారిని, శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామినీ దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా దేవాలయ వేద పండితులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సంప్రదాయాల వాయిద్యాలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి, అమ్మవారులకు అభిషేకాలు, విఘ్నేశ్వర పూజలు చేశారు. వేద పండితులు ఆలయ మండపంలో గవర్నర్ కు పట్టుదస్తులు సత్కరించి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు.

## నట్టల నివారణపై నిర్లక్ష్యం తగదు :ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ శివారు ఒశ్యాతండాలో ఏర్పాటు చేసిన గొర్రెల, మేకలలల్లో నట్టల నివారణ మందుల కంపెనీ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. జిల్లా మొత్తంలో 11 లక్షల 35 వేలగొర్రెలు మేకలు ఉన్నాయని వీటికి మందులు పంపిణీ చేయడానికి జిల్లా వ్యాప్తంగా 265 ఆవాస ప్రాంతాలలో 33 టీంలను ఏర్పాటు చేసి మందులు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో 20 లక్షల 40వేల ఖర్చుతో మూడు రకాల మందులను జీవాలకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గొర్రెలకు నట్టల నివారణ మందును తాగించారు. గత ప్రభుత్వం యాదవుల అభివృద్ధి పేరున అందిన కాడికి దోచుకుని ఈ యాదవ సోదరులకు తీరని నష్టం చేకూర్చిందన్నారు. గొర్రెల పంపిణీ పథకం చేపట్టి అమాయక యాదవ సోదరుల పైన అందిన కాడికి దోచుకున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యాదవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



నట్టల నివారణ మందును తాగిస్తున్న ఎమ్మెల్యే

## పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: డా.స్వరూప రాణి

**వడ్డేపల్లి, డిసెంబరు23 ప్రభాతవార్త:** పశువుల, గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తుందని మండల పశు వైద్య అధికారి స్వరూపరాణి అన్నారు. మంగళవారం పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జూలేకల్ లో పశు వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. సర్పంచ్ ఉప్పల రాజు కార్యక్రమం ప్రారంభం చేశారు. గర్భకోశ వ్యాధులు పరిశీలించి 20 గొడ్డు మోతు పశువులకు పరీక్షలు చేసి రైతులకు మందులు ఇచ్చి, సలహాలు, సూచనలు చేశారు. ఇదే కార్యక్రమం లో 18 మంది కాపర్ల కు చెందిన గొర్రెలు 2085, మేకలు 59 మొత్తం 2144 జీవాలకు నట్టలు నివారణ మందులు తాగించారు. కాపర్లు ఆర్థిక నష్టానికి గురి కాకుండా ఈ కార్యక్రమం చేపట్టినట్లు మండల పశు వైద్యులు డా. స్వరూప రాణి తెలిపారు. మందులు తాగిస్తే జీవాలు ఆరోగ్యంగా ఉంటాయాన్నారు. జీవాలు త్వరగా ఎదిగి, మాంసం దిగుబడి పెరిగి లాభం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విఎల్వో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పి.వర ప్రసాద్, ఎల్ఎస్ఎ లైవ్ స్టాక్ అసిస్టెంట్ షేక్ లతీఫ్, ఓఎస్‌లు వెంకటమ్మ, కృష్ణ, రవి పాల్గొన్నారు.

## హలో టీచర్ చలో జనగామ

**టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు,**

**విస్తృత సమావేశాలకు అధిక సంఖ్యలో తరలిరండి : టిఎస్ యుటిఎఫ్ పిలుపు**

**అడ్డాకుల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఈనెల 28,29 తేదీలలో జనగామ జిల్లా కేంద్రంలో జరగనున్న టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు, రాష్ట్ర విస్తృత సమావేశాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి రావాలని, హలో టీచర్ చలో జనగామ కార్యక్రమంలో పాల్గొనాలని టీఎస్ యుటిఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి వెంకటేష్, జిల్లా కార్యదర్శి ఎనుముల సుదర్శన్, మండల అధ్యక్షులు ఎ. నాగ మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి ఎస్ చిన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ విద్యా సదస్సుకు ప్రొ॥ నాగేశ్వర్, న్యాయ కోవిదులు ప్రొ॥ మాడభూషి శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి తదితర విద్యావేత్తలు ఈ సమావేశాల్లో పాల్గొంటారని, ట్రంప్ సుంకాలు కేంద్ర ప్రభుత్వ వైఖరి, రాజ్యాంగ విలువలు విద్య, అసమానతలు లేని విద్య అనే అంశాలపై విద్యా సదస్సులు నిర్వహించబడుతాయని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, విద్యారంగ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**కారూర్ నూతన సర్పంచ్ శంకర్**

**నవాబుపేట, డిసెంబరు 23 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీని గ్రామస్తుల ప్రజా ప్రతినిధుల సహకారంతో అన్ని విధాలుగా అబి.వృద్ధి చేస్తానని కారూరు గ్రామానికి నూతన సర్పంచిగా ఎన్నికైన ఎర్రోళ్ల శంకర్ అన్నారు. మండల పరిధిలోని కారూరు గ్రామపం చాయతీ కార్యాలయంలో సర్పంచిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకముంచి గెలిపించిన గ్రామస్తులకు రుణపడి ఉంటానని అన్నారు. అన్నిపార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, డిప్యూటీ సర్పంచ్, వార్డు సభ్యుల సూచనలు, సలహాలు తీసుకొని గ్రామంలో గల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్, ఉప సర్పంచ్ శ్రీధర్, వార్డు సభ్యులను మాజీ డిసిసి అధికార ప్రతినిధి జనపల్లి దుష్యంత్ రెడ్డి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామయువకులు, గ్రామ పెద్దలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. పదవి బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ ఎర్రోళ్ల శంకర్ ని అతని మిత్రులు క్లాస్మేట్స్ పూలమాల శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంచినీటి సమస్యను తీర్చిన నూతన సర్పంచ్

**చిన్న చింతకుంట, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఎన్నికల ప్రచారంలో కాలనీవాసులకు ఇచ్చిన హామీని నూతన సర్పంచ్ శివ కుమార్ నెరవేర్చారు. మండలంలోని పర్దిపూర్ గ్రామంలో సంజప్ప కాలనీలోని ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచ్ గా పోటీ చేస్తున్న తెలుగు శివకుమార్, సంజప్ప కాలనీలో ప్రచారం సందర్భంగా సర్పంచ్ గా గెలిచిన వెంటనే నీటి సమస్యను తీర్చుతానని హామీ ఇచ్చి సర్పంచ్ గా గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన రోజు నాడే సంజప్ప కాలనీలో బోరును వేయించారు. సుమారు రెండు ఇంచుల నీరు రావడంతో కాలనీవాసులు సంబరపడ్డారు. నూతనంగా సర్పంచుగా ఎన్నికై ప్రమాణ స్వీకారం రోజున నీటి బోరు వేయించి తమ దాహార్తి తీర్చిన సర్పంచ్ తెలుగు శివకుమార్ కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా సర్పంచ్ శివకుమార్ తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు ఎన్నికల తర్వాత రాజకీయాలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకారం అందించాలని ఆయన కోరారు. సంజప్ప కాలనీ ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు వేయించడం, మోటార్ బిగించి నీటిని సరఫరా చేసి కాలనీ వాసుల నీటి సమస్యను పరిష్కరించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన తెలిపారు.



సంజప్ప కాలనీలో బోరు వేస్తున్న దృశ్యం

## అంద విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

**ఆత్మకూర్ డిసెంబర్ 23, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమ్మిళిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంద విద్యార్థులకు ఉచిత శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం రోజు అంత విద్యార్థులకు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు సూరంపల్లి నవీన్, సూరంపల్లి రమేష్ తదితరులు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన అంద విద్యార్థినీ విద్యార్థులు ఆత్మకూర్ పట్టణంలో సమ్మిళిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అనుభవిస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆత్మకూరుకు చెందిన సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రస్తుత చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఒక్కో విద్యార్థికి ఒకటి చొప్పున 25 మంది విద్యార్థినీ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లుగా వారు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థిని విద్యార్థులకు భోజన సౌకర్యం కూడా కల్పించడం సత్యసాయి సేవా సమితి ఎంతో హర్షించదగ్గ పరిణామంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు దోమ శ్రీనివాసులు, నాగరాజు, బాలరాజు తదితరులతో పాటుగా సత్యసాయి సేవాసమితి కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అంద విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

# రోడ్డు ప్రమాదాలపై సమగ్ర నివేదిక ఇవ్వండి

- ప్రమాదాలు జరిగినప్పుడు ముందస్తు ప్రణాళికలు ఉండాలి
- రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు 1033 నెంబరుకు ఫోన్ చేయాలి
- రోడ్డు భద్రత పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో విస్తరించి ఉన్న జాతీయ రహదారి, ఆర్అండ్‌బి రోడ్ల పై ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎలాంటి ఏర్పాట్లు కావాలి అనే విషయాలను పోలీస్, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత జిల్లాస్థాయి సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే ముందుగా 1033 నెంబరుకు ఫోన్ చేయాలి అనే విషయాన్ని ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆలస్యం కాకుండా ప్రాణాలు కాపాడటానికి అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను దగ్గరలోని ఏ ఆసుపత్రికి తీసుకువెళ్ళాలి అనే విషయాన్ని ముందుగానే ప్రణాళిక



సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

చేసుకొని ఉండాలని సూచించారు. అది ప్రైవేట్ అయిన ప్రభుత్వ ఆసుపత్రి అయిన పర్వాలేదు అన్నారు. జాతీయ రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు వెల్టూరు, పాలెం, మదర్ థెరిసా కూడలి, అమడబాకుల, రంగాపూర్, ఆనందభవన్ వంటి చోట్ల ప్రమాద నివారణ చర్యలు తీసుకున్నప్పటికీ ఇంకా ప్రమాదాలు జరగటానికి కారణాలు ఏంటి అనే విషయాలు అన్వేషించాలన్నారు. జనవరి నెలలో జరిగే రోడ్డు భద్రత వారోత్సవాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరుగకుండా ఉండటానికి సూచిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, వేగం కొలిచే యంత్రాలు వంటివి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వనపర్తి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు పట్టణంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ పనిచేసే విధంగా మరమ్మతులు చేయించడంతో పాటు బస్టాండ్ కూడలి, అంబేద్కర్ కూడలిలో



సమావేశానికి హాజరైన అధికారులు

సైతం కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనవరి ఒకటి నుండి ద్విచక్ర వాహనం నడిపేవారు ఖచ్చితంగా హెల్మెంట్ ధరించాలని లేదంటే జరిమానాలు విధించాలని సుచించారు. ట్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా నడపటం వంటి వాటి పై కటినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మదనపూర్ బ్రిడ్జి పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ వర్షాకాలం లోపు పూర్తి చేయాలని రోడ్లు భవనాల ఇంజనీరును ఆదేశించారు. వనపర్తి రోడ్డు వద్ద అండర్ వే బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బాలాజీ , అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఆర్అండ్‌బి కార్యనిర్వహక ఇంజనీరు దేశ్యానాయక్, ఆర్టీవో మానస, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సాయినాథ్ రెడ్డి, డిప్యూటీ ఈఈ ఆర్అండ్‌బి సీతారామ స్వామి, డియం ఆర్టీసీ, జాతీయ రహదారి ఇంజనీర్లు, కాంట్రాక్టరు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిబిరాలతో పేదలకు వైద్యం : డా.మురళీకృష్ణ

**దేవరకద్ర, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్యం అందజేయడమే లక్ష్యం అని డా.మురళీకృష్ణ అన్నారు. దేవరకద్ర మండలం గద్దె గూడెం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎస్వీఎస్ బస్వరాజ్, రామ్ రెడ్డి, డా. మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. మురళీకృష్ణ, వైద్య బృందం మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో పాఠశాల విద్యార్థులకు, గ్రామ ప్రజలకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, గుండె వ్యాధి చికిత్స, జనరల్ మెడిసిన్, ఊపిరితిత్తుల వ్యాధులు శాస్త్ర చికిత్సలు, ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, తదితరులు సమస్యలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. తదనంతరం గద్దెగూడెం మాజీ సర్పంచ్ గురు ప్రసాద్ మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్లగల మంగమ్మ వెంకట రాములు, మాధవులు, ఎం.వెంకట్ రాములు, శేఖర్, వార్డ్ నెంబర్ ఎం.నాగన్న, ఆంజనేయులు, వెంకటేష్, నాగమ్మ, సుజాత, బాలప్ప, రిటైర్డ్ టీచర్ శ్రీనివాసులు, గద్దగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఆరోగ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామ ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్య**

**చిన్నచింతకుంట, డిసెంబరు23 ప్రభాతవార్త :** భవన, ఇతర నిర్మాణ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదులోని కార్మిక సంక్షేమ బోర్డు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డి.శ్యాంసుందర్‌రెడ్డి సమక్షంలో ఉమ్మడిమహబూబ్‌నగర్ జిల్లా కార్మిక శాఖ అధికారులతోపాటు తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భవనమరియు ఇతర నిర్మాణకార్మికుల సహజ, ప్రమాద మరణాలు, వెటర్నరీ, వివాహబహుమతి, డిజబులిటీతోపాటు పెండింగ్ సంక్షేమ పథకాల పట్ల లేబర్ అధికారులు లేనిపోని కొర్రీలు పెట్టి చాలా క్లెయిమ్స్‌కు డబ్బులు మంజూరు చేయకుండా రిజెక్ట్ చేస్తున్నారు. ఇలా రిజెక్ట్ చేయడం వల్ల భవన ఇతర నిర్మాణ కార్మికులు వారికి వచ్చే సంక్షేమ పథకాలు వారికి చేరకుండా పోతున్నాయని కార్మిక సంఘాల నేతలు జాయింట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల పట్ల లేబర్ అధికారుల నిర్లక్ష్యం విడనాడి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ని వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో మా సంఘం ఆధ్వర్యంలో లేబర్ బోర్డు కార్యాలయాన్ని భవన, ఇతర నిర్మాణ కార్మికులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోళ్లవెంకటన్న, బాలు, టియుసిఐ జిల్లా అధ్యక్షులు, దేవదానం తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కమిషనర్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

## మునగాల గ్రామ అభివృద్ధి కోసం

# రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా

**మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సహకారంతో**

**గ్రామానికి నిధులు తీసుకొస్తా**

**మునగాల గ్రామ సర్పంచ్ కొప్పుల ప్రభాకర్ రెడ్డి**

**ఇటిక్యాల డిసెంబర్ 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మునగాల గ్రామ అభివృద్ధికి రాజకీయాలకి అతీతంగా పని చేసేందుకు కృషి చేస్తానని అలాగే ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సహకారంతో మునగాల గ్రామ అభివృద్ధి కోసం నిధులు తెచ్చి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని గ్రామ నూతన సర్పంచ్ కొప్పుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన కొప్పుల ప్రభాకర్ రెడ్డి సోమవారం పదవి ప్రమాణస్వీకారం ఉపసర్పంచ్ మరియు వార్డుమెంబర్లతో ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈసందర్భంగా గ్రామ మొదటి సమావేశం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ కొప్పుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మునగాల గ్రామంలో కొత్తగా. సిసిరోడ్లు. డ్రైనేజీ నిర్మాణాలు. వీధిలైట్ల ఏర్పాటు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు. కొత్త రేషన్ కార్డులు. వృద్ధాప్య. వికలాంగుల పింఛన్లు. ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. తాను సర్పంచ్‌గా గెలుపొందేందుకు గ్రామ ప్రజల సహకారం ఉందని పార్టీలకు అతీతంగా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందించేందుకు ముందుకొస్తానని మునగాల గ్రామ అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచేందుకు తాను కృషి చేస్తానన్నారు.. ఏఐసిసి కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకొచ్చి గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తానన్నారు.. మునగాల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచానని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సహకారంతో గ్రామ ప్రజలు అండదండలతో తాను సర్పంచ్ గా గెలుపొందానని గుర్తు చేశారు.



మునగాల గ్రామ నూతన సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కొప్పుల ప్రభాకర్ రెడ్డి

## ఎర్రవల్లిలో ఎంపీ మల్లురవిని సత్కరించిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీ మల్లు రవిని సత్కరించిన మండల ముఖ్య నాయకులు

**ఇటిక్యాల డిసెంబర్ 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి ని మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్. ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రుక్మానందరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఎంపీ మల్లు రవి అలంపూర్ జోగులాంబ ఆలయ దర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఎంపీ మల్లు రవి కి వారు స్వాగతం పలికి ఎంపీని శాలువాతో సత్కరించారు...

## రైతు దినోత్సవ సందర్భంగా రైతులకు సన్మానం



రైతులను సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, డిసెంబరు 23ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా తీప్రస్ పల్లి గ్రామంలోని విజయ కాటన్ పత్తి మిల్లులో జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు రైతులు మూల స్తంభమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

## అంగరంగ వైభవంగా సర్పంచుల ప్రమాణ స్వీకార వేడుక

**దామరగిద్ద, డిసెంబరు 23 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ సర్పంచ్ అయిన సభ్యుడైన అను నేను అంటూ సోమవారం పల్లె పల్లె పాలకవర్గాలను కొలువుదీరాయి. దామరగిద్ద మండలంలోని గ్రామపంచాయతీలో ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు సోమవారం వారి వారి గ్రామ పంచాయతీలో సర్పంచులు ప్రత్యేక అధికారుల సమక్షంలో ఉదయం 10.30 గం.లకు ప్రజల ఎదుట సర్పంచ్ అనే నేనే అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. పంచాయతీలో తొలుత సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేశారు. దామరగిద్దలో అద్దన్ కనికి రెడ్డి, కానుకుర్తి గ్రామంలో నారాయణ, బాపనపల్లి గ్రామంలో గవినోల శ్రీనివాస్, క్యాతన్‌పల్లిలో కావలి గోవిందు, లింగారెడ్డిపల్లి గ్రామంలో కావలి మొగులప్ప సర్పంచులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా తొలిరోజు బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేశారు.

## రికార్డుల భద్రతే న్యాయవ్యవస్థకు పునాది

**వార్షిక తనిఖీలతో పోలీసు వ్యవస్థలో మరింత పటిష్టత**

**అట్రాసిటీ, ఫోక్సో, గ్రేవ్ కేసులపై లోతైన సమీక్ష**

**ప్రతి రిజిస్టర్ న్యాయానికి మౌనసాక్ష్యం ఖచ్చితమైన నిర్వహణకు ఆదేశాలు : జిల్లా ఎస్పీ డి. సునితరెడ్డి**

**వనపర్తి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** నేరస్తులను పట్టుకోవడం ఒక బాధ్యత అయితే కేసు రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడం న్యాయానికి చేసే సేవ ప్రతి రిజిస్టర్ తప్పుల్లేకుండా ఉండాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం వనపర్తి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తనిఖీ చేశారు. డిఎస్పీ కార్యాలయానికి చేరుకున్న జిల్లా ఎస్పీకి వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి డీఎస్పీ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఫోక్సో కేసులు, గ్రేవ్ కేసుల పురోగతి, విచారణ స్థితిగతులపై డిఎస్పీని అడిగి జిల్లా ఎస్పీ వివరంగా తెలుసుకున్నారు. ప్రతి కేసు చట్టబద్ధంగా, బాధితులకు న్యాయం జరిగే విధంగా దర్యాప్తు సాగాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం డిఎస్పీ కార్యాలయంలో నిర్వహించేక్రైమ్ రిజిస్టర్, గ్రేవ్ కేస్ రిజిస్టర్, ఒఈ రిజిస్టర్, మైనర్ పిఆర్ రిజిస్టర్, ఇన్‌స్పెక్షన్స్, విసిట్స్ రిజిస్టర్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ రిజిస్టర్, టప్పల్ డెలివరీ రిజిస్టర్, సూపీరియర్ ఆఫీసర్స్ విసిట్స్ రిజిస్టర్‌తో పాటు షీ టీం పనితీరు రికార్డులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ఉండరాదని, ప్రతి ఎంట్రీ న్యాయప్రక్రియకు ఆధారంగా నిలుస్తుందని అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఫోక్సో, గ్రేవ్ కేసుల విషయంలో ఎలాంటి నిరక్ష్యాన్లికీ తావులేదు. ప్రతి కేసు చట్టబద్ధంగా, నిర్దిష్ట గడువుల్లో, పక్కా ఆధారాలతో ముందుకు సాగాలి. ఆలస్యం, తప్పిదాలు, నిరక్ష ్యం చేయడారాదని క్రైమ్ రిజిస్టర్ నుంచి ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వరకు ప్రతి రికార్డు న్యాయానికి ఆధారం. రిజిస్టర్ల నిర్వహణలో పొరపాట్లు ఉంటే న్యాయస్థానాల్లో కేసులు బలహీనపడతాయి. కాబట్టి ప్రతి ఎంట్రీ స్పష్టంగా, బాధ్యతతో ఉండాలని బాధితులకు భద్రత, గౌరవం, న్యాయం కల్పించడమే పోలీసుశాఖ ప్రధాన కర్తవ్యం. షీ టీమ్ పనితీరు సహా ప్రతి విభాగం ఫలితాల ఆధారంగా సమీక్షి ంచబడుతుందని క్రమశిక్షణ, పారదర్శకత తప్పనిసరి ఉండాలని ఎస్పీ తెలిపారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ కృష్ణయ్య, డిసిఆర్బి ఎస్సై తిరుపతి రెడ్డి, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి, గోపాల్‌పేట ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్పీ

## ఎంఎస్ఆర్, మల్లు నర్సింహారెడ్డి కృషితోనే విజయం

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 60 సర్పంచ్ స్థానాలకు గాను 40 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం ప్రజలు కాంగ్రెస్ పార్టీ వెంటనే ఉన్నారని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి 10 వేల ఓట్లు వస్తే, తాజా ఎన్నికల్లో 13 వేల ఓట్లు రావడం రాజకీయంగా ప్రజల విశ్వాసం పెరిగిందనడానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. అలాగే హన్వాడ మండలంలో అసెంబ్లీ ఎన్నికల్లో 15 వేల ఓట్లు రాగా, పంచాయతీ ఎన్నికల్లో 18 వేల ఓట్లు రావడమే కాకుండా అత్యధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాలు గెలవడం కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలో బలపడిన సంకేతమని పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ తమ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కష్టపడ్డారని, వారందరినీ ఈ సందర్భంగా అభినందిస్తున్నట్లు ఆయన చెప్పారు.కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవు – కార్యకర్తలే పార్టీకి ప్రాణం అని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త మన కుటుంబ సభ్యుడనే భావనతో పనిచేయాలని, వ్యక్తిగతవిభేదాలు, వర్గపోరులు పక్కనపెట్టి కాంగ్రెస్ జెండా క్రింద ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. రానున్నఎంపిటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలనురాజకీయంగా అత్యంత కీలకంగా భావిస్తూ, వాటిలో కూడా 100శాతం విజయం సాధించి మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా మార్చాలి అనిపార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, మారే పల్లి సురేందర్ రెడ్డి, బెక్కరి మధుసూదన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్అక్తర్,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు వసంత,డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరుచంద్రకుమార్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అవేజ్, డిసిసి ప్రధాన కార్యదర్శులు సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య , మిడియా ఇంచార్జి సిజె బెనహర్, ఏర్పుల నాగరాజు, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, హన్వాడ మండల మహిళా అధ్యక్షురాలు నవనీత, నాయకులు శేఖర్ నాయక్,లింగంనాయక్, ఐఎన్టీయుసి రాములు యాదవ్, ఫయాజ్, అజ్మత్ అలి,సల్మాన్, రామ చంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, మైత్రి యాదయ్య, మహమ్మద్ రియాజుద్దీన్ , తులసి రామ్ నాయక్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రలోభాలకు భయపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చూపుతాయన్నారు.గతంలో బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు తక్కువ మంది ముందుకు వచ్చేదని, మోదీ సర్కార్‌పై విశ్వాసంతో మనల్ని గెలిపించారని అందుకు అనుగుణంగా పని చేయాలన్నారు. కేంద్రం నిధులు, పార్లమెంట్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. స్వల్ప ఓట్లతో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారని, వారి బాధ వర్ణనాతీత అన్నారు. రానున్న ఎంపీటీసీ , జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ నుంచి ఎవరిని అభ్యర్థిగా నిలిపిన గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ ఎన్నికలే అధికారం లోకి రావడానికి పునాదులు అని బిజెపి తెలంగాణ లో ఒక్క సారి అధికారంలోకి వస్తే దించే సత్తా ఏ పార్టీకి లేదన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలమూరుకు ఏం చేయలేదని చెప్పారు. పాలమూరుజిల్లా పేరుతో సెంటిమెంట్ రాజకీయాలు చేసి బతకాలని చూస్తున్నారని దయ్యబట్టారు. రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది బీజేపీ అని పునరుద్ఘాటించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజా రెడ్డి,శ్రీశైలం బోర్డు మెంబర్ కట్ట సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు వీర బ్రహ్మచారి, జనార్ధన్ రెడ్డి, గాలి రెడ్డి, పాండురంగారెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి,అంజయ్య,ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## టైగర్ రిజర్వ్ గ్రామాల పునరావాసం పారదర్శకంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ మార్గదర్శకాలు, ఎన్‌టీసీఏ నిబంధనల ప్రకారం కాలపరిమితిలో, పారదర్శకంగా జరగాలని,గ్రామాల పునరావాసం నిమిత్తం అచ్చంపేట డివిజన్, లింగాల్ మండలంలోని బాచారం రిజర్వ్ ఫారెస్ట్‌లో 1501.88 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఇన్ ప్రిన్సిపల్ (స్టేజ్-2) అనుమతి లభించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ అనుమతితో పునరావాస కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి మార్గం సుగమమైందన్నారు. పునరావాసం అంటే కేవలం ఇళ్ల నిర్మాణమే కాకుండా సంపూర్ణ జీవన వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పునరావాస ప్రాంతాల్లో త్రాగునీరు,విద్యుత్,రహదారులు, డ్రైనేజీ,పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.160 మంది లబ్ధిదారులకు చెల్లించాల్సిన 15 లక్షల రూపాయల పరిహారానికి సంబంధించి జాయింట్ బ్యాంకు ఖాతాలు వెంటనే తెరవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ప్రతి కుటుంబానికి 5 ఎకరాల వ్యవసాయ భూమిని రెవెన్యూ పట్టాలతో అందించనున్నట్లు, ఆ భూమి విక్రయానికి 10 సంవత్సరాల కాల పరిమితి ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.సార్లపల్లి సర్పంచ్ రాములు గ్రామ ప్రజలకు సంబంధించిన వివిధ అంశాల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.ఈ సమీక్షా సమావేశంలో ఎస్డీవో ఇమ్రాన్ సిద్ధికి, వివిధ శాఖల జిల్లా అధికారులు,ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు.పదవతరగతి వార్షిక పరీక్షలను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన ఆకాంక్షించారు. మన పాలమూరు యూనివర్సిటీ లో కొత్తగా ఇంజనీరింగ్ కళాశాల,లాకళాశాల తోపాటు మరిన్ని నూతన కోర్సులు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ప్రత్యేకించి ఐఐటి కళాశాల మన కోసం తెచ్చుకున్నదని ఈ ఐఐటి కళాశాలలో ఎక్కువ శాతం మన ఉమ్మడి మహబూబ్‌నగర్ విద్యార్థులే అడ్మిషన్ పొందాలన్నదే తనలక్ష్యం అనిఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ,మహబూబ్‌నగర్‌ఫస్ట్ పర్యవేక్షకులు గుండామనోహర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్వేజ్, వెంకటరమణ, శాంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడంకోసమే ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో జిల్లాలో మొత్తం రెండు కోట్ల 20 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.వనపర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ప్రారంభంజిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వింగ్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనపర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి తో కలిసి ప్రారంభించారు. పోలీస్11, అంజి11 జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు జిల్లా కలెక్టర్ కొంతసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. జిల్లా మత్స్యశాఖ డిడి ఖదీర్ అహ్మద్, ఏడి లక్ష్మప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మత్స్యకార సహకార సంఘాల నాయకులు కృష్ణయ్య, లక్ష్మయ్య, చంద్రమౌళి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మక్తల్ పట్టణంలో మంత్రి బైక్ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి డా.వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన మక్తల్ పట్టణంలోపలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే వార్డుల్లో పర్యటించడం జరిగిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి త్వరగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి వెంబడి కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, కోళ్ళ వెంకటేష్, బి.గణేష్ కుమార్, కావలి తాయప్ప, కట్ట వెంకటేష్, నూరొద్దీన్, ఉసాముద్దీన్, బి.శంషొద్దీన్, పూజ శివరాజ్, బోయ నరసింహ, ఫయాజ్, సాలంబిన్ ఉమర్ బస్రవి, గాయత్రి అనిల్ కుమార్, మున్సిపల్ ఏఈ నాగశివ, తదితరులున్నారు.

## 8 పాఠశాలలు రాష్ట్రస్థాయికి..

(మొదటి పేజీ తరువాయి)

ఈ 8 పాఠశాలలు జాతీయస్థాయికి ఎంపిక ఎందుకు కృషి చేస్తున్నాయి.ఈ 8 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్ విజయేంద్ర బోయి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ఇచ్చి, శాలువాతో సత్కారం చేసినట్లు కార్యక్రమ జిల్లా సమన్వయకర్త , సీఎంఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ బహుమతుల ప్రధాన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మధుసూదన్ నాయక్, ఆర్డిఓ నవీన్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్,అన్ని మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

**నారాయణ పేట, డిసెంబరు23 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా మనోహర్ ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వకీల్ సంతోష్‌లను మంగళవారం నారాయణపేట నియోజకవర్గం ఇంచార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల కోసం భవన నిర్మాణానికి అవసరమైన స్థలం ఏర్పాటు అంశంలో సానుకూలంగా స్పందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోటూర్ నాగేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆలనూర్ వినోద్, బసపురం వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా కందులను తీసుకోవాలి

**నారాయణ పేట, డిసెంబరు 23 ప్రభాతవార్త :** నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో మంగళవారం భారీగా కందులు రావడంతో ప్రస్తుతం కందుల టెండర్ ధరలు రూ.7,500 నుంచి రూ.6,000 వరకు మాత్రమే పలకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందుల నాణ్యతను పరిశీలించిన భారతీయ కిసాన్ సంఘం పట్టణ,జిల్లా కమిటీలు, కొంతమంది రైతులకు సరైన ధర రాకపోవడానికి కారణం కందులు నాసిరకంగా ఉండటమేనని వెల్లడించారు. కొంతమంది రైతులకు టెండర్‌లో ధర రాకపోవడంతో వ్యాపారస్తులతో చర్చించి కందులు కొనుగోలు చేయించేలా సంఘం నాయకులు చర్యలు చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కందులు పూర్తిగా కొనుగోలు చేయాలని వ్యవసాయ



కందులను పరిశీలిస్తున్న భారతీయ కిసాన్ సంఘం పట్టణ,జిల్లా కమిటీలు

మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డిని రైతుల పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కమిటీ సభ్యుడు పటేల్ రంగారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శరణప్ప,పట్టణ అధ్యక్షులు ఆకుల వెంకటప్ప,ఉపాధ్యక్షులు తంగు విశ్వనాథ్‌రెడ్డి, జాగాపురం లక్ష్మీకాంత్, గుట్ట మీద కిష్టప్ప, శాసమూల బాలప్ప, మండల అధ్యక్షుడు శాసనపల్లి గడప శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పేటలోని మౌలానా దుకాణం,గాండ్ల శివకుమార్ దుకాణం, నారాయణ దుకాణాల్లో కందులను పరిశీలించడం జరిగింది. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు సంఘం ఎప్పుడూ ముందుంటుందని నాయకులు స్పష్టం చేశారు.

## మీ సొమ్ము - మీ హక్కు నినాదంతో అవగాహన సదస్సు

**నారాయణపేట, డిసెంబరు 23 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. క్లైమ్ చేయని ఆస్తులు, బ్యాంక్ డిపాజిట్ల పరిష్కారం కోసం మూడు నెలల పాటు మీ సొమ్ము – మీ హక్కు" నినాదంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ , ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రెహమాన్, ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం నుంచి సిఎం సత్యప్రకాశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్ఎస్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, క్లైమ్ చేయని పొదుపు ఖాతాలు, డిపాజిట్లను అసలైన ఖాతాదారులు లేదా వారసులు ఏ విధంగా తిరిగి పొందవచ్చో వివరించారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖాతాలు ఉన్నందున వాటిని త్వరితగతిన సెటిల్ చేయడానికి బ్యాంకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా అధికారులు, ప్రజలు తమ క్లైమ్ చేయని బ్యాంక్ డిపాజిట్లను సంబంధిత బ్యాంకులను సంప్రదించి సులభంగా పొందాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమం అత్యంత ముఖ్యమైనదని అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రెహమాన్ మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో క్లైమ్‌లు పరిష్కరించే బ్యాంకులకు ఆర్‌బీఐ ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించిందని తెలిపారు. నిరర్థక ఆస్తులకు సంబంధించిన అసలైన వారసులు అవసరమైన పత్రాలతో బ్యాంకులు, సంబంధిత సంస్థలను సంప్రదించి ఈ ప్రచారాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.



## విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో నైపుణ్యత చూపాలి

◆ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**గద్వాల డిసెంబర్ 23, ప్రభాతవార్త:** బాల విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యేలు ప్రశంసా పత్రాలు మెమెంటోలను అందజేశారు. మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక 2025 26 శ్రీనివాస రామానుజన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్యయతులుగా హాజరయ్యారు. జిల్లా స్థాయి బాల విజ్ఞాన ప్రదర్శనను సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ సంబంధించిన ప్రాజెక్టులను పరిశీలించి మంచి ప్రతిభను సాధించిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ , తృతీయం సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రము మెమెంటోలను ఎమ్మెల్యేలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడు తూ... విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాలలో నైపుణ్యత చూపాలన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ సంబంధించిన విషయాల పైన పిల్లలకు అవగాహన కల్పించాలినీ,అదేవిధంగా విద్యార్థులు నైపుణ్యాన్ని జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి అంతర్ జాతీయస్థాయిలోకి వెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి సైంటిస్టులు అయ్యే విధంగా కృషి చేయాలనీ, భవిష్యత్తులో విద్యార్థుల కోసం మరెన్నో కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న నైపుణ్య ప్రతిభను వెలుగు తీయాలని సూచించారు. భవిష్యత్తులో విద్యారంగా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాననీ అదేవిధంగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో మంచి ప్రతిభను సాధించి మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలకు మీ గ్రామానికి గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చే విధంగా ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్యంతో కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్ లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు

## క్రిస్మస్ పండగ సందర్భంగా పాస్టర్‌లకు బట్టల పంపిణీ

**గద్వాల, డిసెంబర్23, ప్రభాతవార్త:**గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల నియోజకవర్గంలోని పాస్టర్లకు క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాస్టర్లకు కొత్త బట్టలను పంపిణీ చేశారు. క్రిస్మస్‌పండగ కానుకగా అన్నిచర్చిల పాస్టర్లలకు ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో బట్టలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...క్రైస్తవ సోదరీ, సోదరులకు క్రిస్ మస్ శుభాకాంక్షలు తెలుపుతూ దైవ సమానులు పాస్టర్లు ప్రతి ఒక్కరిని దేవుని పై గల కృపను దేవుడు ఆ యేసు ప్రభు చేసినవిషయాలను ప్రజలలోకి తీసుకువెళ్లి క్రైస్తవ సోదరులకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో యువత చెడు మార్గం వైపు, చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా యువతను కూడా దేవునిపై కృప కలిగే విధంగా కృషి చేస్తున్నారన్నారు. పాస్టర్ల కు నావంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి రమేష్ నాయుడు,మాజీ ఎంపీపీలు విజయ్,రాజారెడ్డి, మాజీ జడ్పిటిసి, సర్పంచ్ రాజశేఖర్, నాయకులు వెంకటన్న ఉరుకుందు, యుగంధర్, పాస్టర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కొత్త బట్టలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## నాణ్యమైన విద్యుత్ అందించటమే లక్ష్యం : ఏడీఈ

**అయిజ డిసెంబర్23, ప్రభాతవార్త:** ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించటమే లక్ష్యంగా అధికారులు, సిబ్బందితో కలిసి పనిచేస్తున్నామని ఏడీఈ నీలి గోవిందు అన్నారు. బుధవారం అయిజ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్కు మరమ్మత్తులు చేశారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, లో వొల్టేజి సమస్యను నివారించాలని ట్రాన్స్‌ఫార్మల స్థాయి పెంపు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తులు తీసుకుంటాన్నామని వివరించారు. అంతరాయం, ప్రమాదం ఉన్నచోట విద్యుత్ స్థంబాలు, తీగలు మార్చటం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ట్రాన్స్‌ఫార్మర్ నందు ఏబీ స్విచ్లు మరమ్మత్తులు, బుష్షాడ్లు, జంపర్లు మార్చటం జరిగిందని తెలిపారు. వారంలో 3 రోజులు ప్రజాబాట కార్యక్రమములో భాగంగా వీధలు సిబ్బందితో కలిసి తిరుగుత ఉన్నామని తెలిపారు. అక్కడి వీధులలో ఉన్న సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నావ అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నామని తెలియచేశారు.ఈ కార్యక్రమములో లైన్‌ఇన్స్పెక్టర్ సర్వోత్తమ్, లైన్మెన్లు రామకృష్ణ, రవివర్ధన్, విఠల్, వీరేష్, సూరి, రమేష్లు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్ల బిల్లును చెల్లించాలి

**ఖిల్లాగణపురం డిసెంబర్23,ప్రభాతవార్త:** పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటిబిల్లులను చెల్లించాలని మండల బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పత్రిక భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు సాయినాథ్,గోపి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ఇంటి నిర్మాణాలు చేపట్టిన నిరుపేదలందరికీ పార్టీలకు అతీతంగా ఇండ్ల బిల్లులు చెల్లించాలని వారు పత్రిక ముఖంగా కోరారు. మండల కేంద్రానికి చెందిన పలువురు ఇల్లు నిర్మించుకున్న లబ్ధి దారులకు ఇండ్ల బిల్లులు ఇవ్వడం లేదని ఈ విషయమై జిల్లా కలెక్టర్ కార్యాలయం వెళితే వారు మండల కేంద్రంలో ఉన్న అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి తిప్పి పంపారని గత మూడు నాలుగు నెలలుగా అధికారులను రాజకీయ నాయకులను కలుస్తూనే ఉన్నామని తాము కష్టపడి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నామని వాటికి బిల్లులు ఇప్పించాలని ఇండ్లు నిర్మించుకున్న పలువురు లబ్ధిదారులు ఈ సమా వేశంలో విలేకరులకు వివరించారు.ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారు గ్రామపంచాయతీ నుండి ఇంటి నిర్మాణం కోసం పరిమిషన్లు తీసుకోవాలని పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఒక్కో ఇంటికి ఎనిమిది వేల నుండి పదివేల వరకు వసూలు చేస్తున్నారని నిరుపేదలనుండి డబ్బులు వసూలు చేయడం ఆపివేయాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మఇండ్ల బిల్లుల చెల్లింపులో నాయకుల ఒత్తిడి లేకుండా బిల్లులు చెల్లించే విధంగా జిల్లాకలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గోపాల్ .శివశంకర్. రామచంద్రయ్య.రాజు.శివ.అనిల్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

**అమరచింత డిసెంబర్ 23, ప్రభాతవార్త:** ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తిప్పడం పల్లి పి.హెచ్.సి సంబంధించిన ఆశ వర్కర్లు మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని డిఎంఆర్ హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వ హించి మెడికల్ ఆఫీసర్ ఫయాజ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు, ఆర్ ఎన్ రమేష్ మాట్లాడుతూ, ఆశ వర్కర్లకు పిక్సుడు వేతనం 18000 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన అమలు చేయడం లేదని ఆయన అన్నారు. అలాగే ఆశ వర్కర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలలో పల్స్ పోలియో, లేప్రాసి, ఎన్నికల వీధుల్లో పాల్గొన్న డబ్బులు ఇవ్వడం లేదని వెంటనే పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతమ్మ, సత్తెమ్మ, నవనీత, పుష్పలత, గోపాలమ్మ, నిర్మల, పద్మ, రసీదా బేగం, సుధా, స్రవంతి, మేరీ తదితరులు పాల్గొన్నారు.



## తాపీ కార్మికుడి నుండి సర్పంచ్..

**వీపనగండ్ల డిసెంబర్23, ప్రభాత వార్త:** శ్రమను నమ్ముకొని పనిచేసే కార్మికులు కూలీలు కానీ ప్రభుత్వం కల్పించినటువంటి రిజర్వేషన్లలో అవకాశం వచ్చినదాన్ని జారా విడుచుకోకుండా ప్రజాప్రతినిధిగా ప్రజలతో మమేకమై ప్రజా విజయాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని సర్పంచ్‌గా ఎంపిక కావడం గొప్ప అవకాశం ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి కలవరల్ల గ్రామ సర్పంచ్‌గా బండారి రాముడు ఎన్నికయ్యారు. తాపీ కార్మికుడిగా పనిచేస్తూ ప్రజలలో తలమానికంగా ఉండి ప్రజల కోసం పనిచేసే పేదకుటుంబం నుండి వచ్చిన తాపీ కార్మికుడు బండారి రాముడు దళిత కుటుంబానికి చెందిన ఇతను తన సొంత కష్టంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు దానితోపాటు సెంట్రింగ్ చెక్క ఇండ్లకు కిరాయిలకు ఇస్తూ బ్రతుకును కొనసాగిస్తున్నాడు ఇటువంటి వ్యక్తిని ఎక్సైజ్ పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు గుర్తించి అతనికి తమ సహాయ సహకారాలు ఉంటాయని సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దింపడం జరిగింది. ఇటీవల జరిగిన టువంటి ఎన్నికల్లో గ్రామంలో తమ సమీప టిఆర్ఎస్ అభ్యర్థి పై 71 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు 9 వార్డులను గెలుచుకొని ఉపసర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకోవడం విశేషం అయితే ఈ గ్రామ పంచాయతీ పెద్ద గ్రామపంచాయతీ కావడం అది ఇటీవల రిజర్వేషన్లలో ఎస్సీ రిజర్వుడు కావడం ఆ వ్యక్తికి కలిసి వచ్చిన విషయం అని గ్రామంలోని ప్రజానికం చర్చించుకుంటున్నారు.



కల్వరాల్ల గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన బండారి రాముడు

## కేసీఆర్ పాలమూరుకు చేసిందేమీ లేదు

- పాలమూరు -రంగారెడ్డి డీపీఆర్ మార్చారు
- కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ పాలమూరుపై ఎందుకు లేదు
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



**మహబూబ్‌నగర్ బ్యూరో;డిసెంబర్23,ప్రభాతవార్త:** రాజకీయంగా పతనమైన వారందరూ పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకుంటున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ మరోసారి పాలమూరు ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతున్నారని, పాలమూరు జిల్లాకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి లేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి ఆర్డీఎస్ ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. మల్లమ్మకుంట అతిగతి లేదని, ఆర్డీఎస్ అనేది అలంపూర్‌కి మాత్రమే పరిమితం.. అయిన దానిని కూడాపూర్తి చేయకుండా అలంపూర్ రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు.ఆర్డీఎస్‌తో ఆంధ్రా తెలంగాణ సెంటిమెంట్ రెచ్చగొట్టారని, పదేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ లో మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయలేదు. పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్ట్ కోసం తాను మంత్రిగా పట్టుబట్టి... జీవో తెస్తే...కేసీఆర్ అధికారంలోకి వచ్చాక..పాలమూరు ప్రాజెక్ట్ డీపీఆర్ మొత్తం మార్చారని వివరించారు. జూరాల నుంచి కాకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్ నీళ్ల తీసుకునేలా డీపీఆర్ మార్చారని చెప్పారు. పామూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ డీపీఆర్ ఒక్కటే కేంద్రం పంపారా.. చెప్పాలని డిమాండ్ చేశారు. యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన జీవోను కాంగ్రెస్ పట్టించుకోవడం లేదని, లక్షల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కట్టారని, కాళేశ్వరం పై ఉన్న శ్రద్ధ పాలమూరు–రంగారెడ్డిపై ఎందుకు పెట్టలేదో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.గజ్వేల్,సిద్దిపేట, సిరిసిల్ల లో రోడ్లు వేసుకున్నారు... పాలమూరు జిల్లా ఏం పాపం చేసిందన్నారు. ప్రాజెక్టులకు నష్టం చేశారు..విద్య, వైద్యం ప్రతి దానిలో పాలమూరు కు కేసీఆర్ ద్రోహం చేశారని పేర్కొన్నారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుక నేందుకు రెండు పార్టీలు కుట్రలు చేస్తున్నాయని పేర్కొన్నారు. అందులో భాగమే కేంద్రంపై చేసే ఆరోపణలు.. కాంగ్రెస్, బీఆర్ ఎస్ అండర్‌స్టాండింగ్ పాలిటిక్స్ చేస్తున్నాయని అనడానికి నిదర్శనం అఖిలేష్ యాదవ్ కలయిక. తెలంగాణలో ఎన్ని కుట్రలు చేసిన బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు.మోదీ సర్కార్ చేస్తు న్న అభివృద్ధి,సంక్షేమ పథకాలు చూసి..తెలంగాణలో ప్రజలు బీజేపీనీ అధికారంలోకి తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని విమర్శించే నైతిక హక్కు కేసీఆర్ కి లేదన్నారు. డిండికి పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ నుంచి నీళ్ల తీసుకువెళ్తాం అంటే.. గతంలో అభ్యంతరం తెలిపాం..దానికే కట్టుబడి ఉన్నాం. నల్గొండకు నీళ్ళు తీసుకోవడానికి నాగార్జున సాగర్ ఉంది. డిండి కి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నుంచి నీళ్ల తీసుకువెళ్లడం పై తీవ్రంగా వ్యతిరేకించడం జరిగిందని, ఇప్పుడు వ్యతిరేకిస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లాకు నీళ్ల ఇవ్వడం పై తమకు అభ్యంతరం లేదన్నారు. రైజింగ్ తెలంగాణ అంటే హైదరాబాద్ అభివృద్ధి మాత్రమే కాదు. అన్ని జిల్లాలు అభివృద్ధి అయితేనే.. రైజింగ్ తెలంగాణ సాధ్యంఅవుతుంది.ఈశాన్య రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందితేనే.. వికసిత్ భారత్ సాధ్యం అవుతుందన్నారు.

## మహబూబ్‌నగర్ పోలీస్ సిబ్బందికి రివార్డులు

**మహబూబ్‌నగర్, డిసెంబర్23,ప్రభాతవార్త:** సి.సి.టి.ఎన్.ఎస్ లో పోలీస్ శాఖకు సంబంధించిన డాక్యుమెంట్లను ఎప్పటికప్పుడు సకాలంలో అప్డేట్ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐటీ సెల్ కోఆర్డినేటర్లు, ఐటీ కోర్ టీం మరియు టెక్ టీం సిబ్బంది మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 171 మంది కి డీజీపీ కార్యాలయం మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో మెగా రివార్డ్ మేళా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా నుండి నలుగురు అవార్డులు పొందారు. ఐటీ సెల్ కోఆర్డినేటర్‌గా హెచ్‌సీ 1839 రాజేశ్వర్ రెడ్డి,ఐటీ కోర్ టీం సభ్యుడిగా హెచ్‌సీ 226 విజయ్ కుమార్,టెక్ టీం సిబ్బందిగా బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పీసీ 2230 పి. శ్రీనివాసులు, హన్వాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన డబ్ల్యూపీసీ 3679 పి. యాదమ్మ అడిషనల్ డీజీ (టెక్నికల్ సర్వీసెస్) శ్రీ శ్రీనివాస రావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి ధరావత్ ప్రశంసా పత్రాలు పొందిన మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి,భవిష్యత్తులోకూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి శాఖ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.



క్రిస్మస్ పండుగ కేక్ కట్ చేస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయ బృందం

## సరస్వతి టెక్నో పాఠశాలలో సెమి క్రిస్మస్ వేడుకలు

**ఇటిక్యాల డిసెంబర్ 23, ప్రభాతవార్త;** మానవాళి రక్షణకై ఏసుక్రీస్తు సిలువలో రక్తం కార్చారని క్రైస్తవులు క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని సరస్వతి టెక్నో పాఠశాల కరస్పాండెంట్ మధులిక రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో పాఠశాలలో మంగళవారం చిన్నారులు, ఉపాధ్యాయ బృందం సెమి క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రిస్మస్ పండుగ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణలో వచ్చారు. ఈ సందర్భంగా సెమి క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చిన్నారులను ఉద్దేశించి కరస్పాండెంట్ మధులిక రెడ్డి మాట్లాడుతూ. మొదటగా విద్యార్థులకు మరియు ఉపాధ్యాయ బృందానికి సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల నందు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ప్రపంచంలో అన్ని పండుగల కంటే ఎక్కువగా క్రిస్మస్ పండుగనే జరుపుకుంటారనిఅత్యంత భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు జరుపుకుంటారన్నారు. అలాగే ఐక్యమత్యంతో కులమతాలకు అతీతంగా అందరితో కలిసి ఉంటూ అన్ని పండుగలు జరుపుకోవాలని విద్యార్థులకు వివరిస్తూ క్రిస్మస్ అన్న పేరు క్రిస్టోస్, మాసే అనే రెండు పదాల నుంచి క్రిస్మస్ వచ్చిందని దాని అర్థం క్రీస్తును ఆరాధించుటఅని వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు సెమీ క్రిస్మస్ కేక్ కటింగ్ ఏసుక్రీస్తు ను ఆరాధించే బైబిల్ వాక్యాలతో ప్రార్థనలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ మధులిక రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మహిమ శ్రీ, అధ్యాపక బృందం సురక్షిని, అమూల్య, ప్రభాకర్, ఆంజనేయులు, ప్రియాంక, ప్రమీల, స్వాతి, కీర్తి, ప్రతిభ, కళావతి, మనీ, పార్వతి, రజిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## హిందువులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదు



బంగ్లాదేశ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

**నారాయణపేట, డిసెంబరు 23 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం జస్టిస్‌ఫర్ బంగ్లాదేశ్ హిందూస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ చౌక్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు భారీనిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో బంగ్లాదేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా హిందువులపై దాడులు జరిగితే సహించేది లేదని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీప్‌దాస్‌ను అకారణంగా హత్య చేసి, కిరాతకంగా చెట్టుకు వేలాడదీసి నిప్పంటించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అఖిల భారత విశ్వహిందూ పరిషత్ పిలుపుమేరకు నాయకులు మాట్లాడుతూ హిందూ వ్యతిరేక శక్తులు ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్‌గా పరిగణలోకి తీసుకొని, హిందువులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ఈ నిరసన కార్యక్రమంలో సత్య యాదవ్, సురేఖ రాంబాబు, ఉమాదేవి, కడేచుర్ రజిత, డా. మదన్మోహన్ రెడ్డి, స్వాతి, కన్న శివకుమార్, భీమ్ చంద్రగౌడ్, మురళి భట్టడ్, మనోహర్ ప్రసాద్ గౌడ్, గందెచంద్రకాంత్, శిరీషచెన్నారెడ్డి, పోషల్ వినోద్, సత్య రఘుపాల్, ప్రవీణ్, కాకర్ల భీమయ్య, మిర్చి వెంకటయ్య, చంద్రశేఖర్, పోషల్ సంతోష్, సంపంగి కృష్ణ, రఘువీర్ యాదవ్, శ్రావణ్, చరణ్ రెడ్డి, నరేష్, బొంబాయి బాలాజీ, ఆకాష్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల విలేకరికి పితృవియోగం

**భూత్పూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** విజయక్రాంతి భూత్పూర్ మండల రిపోర్టర్ మొహ్మద్ జహంగీర్‌కు పితృవియోగం కల్గింది. జహంగీర్ తండ్రి మొహ్మద్ కరీం(కరివెన కరీం) మంగళవారం సాయంత్రం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయన స్వగ్రామం అమిస్తాపూర్‌లో మృతి చెందారు. ఆయన కొంత కాలంగాఅనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. తండ్రిని కోల్పోయిన జహంగీర్‌ను ఆయన కుటుంబ సభ్యుల్ని మండలంలోని పలువురు జర్నలిస్టులు పరామర్శించి తమ తీవ్రసంతాపాన్ని వ్యక్తం చేశారు. కరీం ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆకాంక్షిస్తూ భగవంతుని కోరుకున్నారు.

## దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

**దామరగిద్ద, డిసెంబరు23 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం మొగలమడక గ్రామంలో గతవారం కోనాపురం వెంకటేష్ తండ్రి ఆశప్ప అనే వ్యక్తి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినారు అని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ రాజు ఎట్టకేలకు ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా కేసును చేదించి, నిందితులు అయిన కూరుకు నవీన్ తండ్రి నరసప్ప, బైరంకొండ శ్రీను అలియాస్ శ్రీనివాస్‌తండ్రి సాయప్పలుగా గుర్తించి వారి నుండి దొంగిలించినటువంటి ఒక్కొక్కటి అర్థ తులం చొప్పున రెండు బంగారు ఉంగరాలు, ఆరు మాసాల చెవి కమ్మలు, 16వెండి ఉంగరాలు, ఒక వెండి బ్రాస్‌లెట్ 30వేల రూపాయల నగదును వారి నుండి స్వాధీనపరచుకొని నేరస్తులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు అని ఎస్సై రాజు తెలిపారు.

## కలిసి కట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం!

### ఉడ్మల్‌గిద్ద సర్పంచ్ సత్యమ్మ



మొక్క నాటుతున్న ఉడ్మల్‌గిద్ద సర్పంచ్ సత్యమ్మ

**దామరగిద్ద, డిసెంబరు 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉడ్మల్‌గిద్ద గ్రామ సర్పంచ్ సత్యమ్మ మొదటిరోజు గ్రామ పంచాయతీలో జరిగిన అఖిలపక్షం సమావేశంలో మాట్లాడుతూ మమ్మల్ని గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా అత్యక మెజారిటితో గెలిపించిన గ్రామ ప్రజలకు, యువతకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికోసం అన్ని పక్షాలను కలుపుకొని ముందుకెళ్తామని స్థానిక ఎమ్మెల్యే సహకారంతో గ్రామ అభివృద్ధి సాధిస్తామని అన్నారు. అనంతరం ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు త్రాగునీరు సమస్య పరిష్కరించాలని ఉపాద్యాయులు సర్పంచ్ దృష్టికి తేవడంతోత్వరలో పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాయప్ప, వార్డు సభ్యులు భీమేష్, హన్మంతు, మధు, లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, సీపీఐఎంఎల్ (మాస్ లైన్) జిల్లా నాయకులు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు వీరప్ప, సిపియం గ్రామకార్యదర్శి ప్రకాష్, నర్సిములు, వెంకటప్పతో పాటు పంచాయతీ వర్కర్స్ పాల్గొన్నారు.

## గోపాలదిన్నె రిజర్వాయర్లో చేప పిల్లలను వదిలిన మత్స్యశాఖ అధికారులు

**వీపనగండ్ల. డిసెంబర్ 23, ప్రభాతవార్త:** మండలంలోని గోపాల్దిన్నె రిజర్వాయర్లో 3,60,000 చేప పిల్లలను వదిలినట్లు మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ భరత్ ఫిషర్ మెన్ రాజు తెలిపారు మంగళవారం నాడు రిజర్వాయర్లో చేపలను వదిన వాళ్ళు మాట్లాడుతూ మత్స్యశాఖ వీపనగండ్ల కల్వరాల్ల గోపాల్దిన్నె వారి ఆధ్వర్యంలో ఈ చేప పిల్లలను వదిలినట్లు వారు తెలిపారు ఈ చేప పిల్లలు బొచ్చ రగడ మోసు మొదలు గు నాలుగు రకాలవి ఉన్నట్లు వారు తెలిపారు. అయితే ఈ చేప పిల్లలు గతంలో చిన్నవి గల చేప పిల్లలను వదిలేది అని ఇప్పుడు అవి ఇంచు ఇంచుంబావ్ చేప పిల్లలు వదిలినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి వీపనగండ్ల సర్పంచ్ మీసాల పార్వతమ్మ గోపాలదిన్నె సర్పంచ్ దొడ్ల కవిత కల్వ రాళ్ల బండారి రాముడు హాజరయ్యారు. దీనికి వీపనగండ్ల మత్స్యశాఖ అధ్యక్షుడు నక్క వెంకటస్వామి ఉపాధ్యక్షులు సగనమోని వెంకటస్వామి అలియాస్ వైయస్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దొడ్ల బాల్‌రెడ్డి మత్స్యకారులు నక్క విష్ణు నక్క రాముడు సగనముని రామకృష్ణ సిహెచ్ వెంకటయ్య సగనమోని సురేష్ రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటరెడ్డి దయ్యపు మోహన్ బసవరాజు గౌడు వార్డు మెంబర్ సుబ్రమణ్య చారి తదితరులు హాజరయ్యారు.



# నాణ్యమైన విద్య, వైద్యం అందేలా కృషి చేయాలి

- ◆ క్షయ రహిత సమాజాన్ని నిర్మించడం కోసం జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయం
- ◆ చేనేత రంగానికి గుర్తింపు కల్పించి భావితరాలకు ప్రాధాన్యతను తెలియజేయాలి
- ◆ సమాజ అభ్యున్నతిలో వివిధ రంగాల కళాకారులది కీలక పాత్ర
- ◆ తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



గవర్నర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా కలెక్టర్, చిత్రంలో ఎంపీ మల్లురవి



గవర్నర్‌కు మొక్కతో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు23 ప్రభాతవార్త:** సమాజంలో అట్టడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్య, వైద్యం అందాలని, బలమైన సమాజాన్ని నిర్మించినప్పుడే బలమైన దేశం తయారవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రధానమంత్రి కలలు కంటున్న వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ విద్య, వైద్యం, ఆర్థికంగా సాధికారత సాధించాలన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా సమీకృ తకార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వనపర్తి జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య సాదర స్వాగతం పలికారు. కలెక్టరేట్ ఆవరణలో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్, ఆ వెంటనే వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అక్కడే ఏర్పాటు చేసిన స్టాల్స్, విద్యార్థుల యొక్క సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను తిలకించారు. నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, గవర్నర్ స్పెషల్ సెక్రెటరీ భవాని శంకర్, ఎస్పిడి సునీతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్య, వైద్యం అందేలాకృషి చేయాలని సూచించారు. బలమైన సమాజాన్ని నిర్మించినప్పుడే బలమైన దేశం తయారవుతుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలోకవులు, కళాకారులు, రచయితలు, వివిధ రంగాల ప్రముఖులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పుడే సమాజం పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకుంటుందని తెలిపారు. క్షయరహిత సమాజాన్ని నిర్మించాలన్నా, బాల్యవివాహాలను నిర్మూలించాలన్నా కవులు, కళాకారులు, రచయితల గళం ఎంతో కీలకమన్నారు. వీరంతా సమాజంలో భాగస్వాములై తమ గళాన్ని వినిపించాలని ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలియజేశారు. ప్రత్యక్షంగా పరస్పర మానవ సంబంధాలతోనేసమాజంలో సాధికారత సాధ్యమవుతుందని తెలియజేశారు. వనపర్తి జిల్లాలో క్షయ రహిత సమాజాన్ని నిర్మించడం కోసం జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ ఉండాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం హెల్త్ యాప్ ని సృష్టించడం చాలా అద్భుతమని గవర్నర్ కొనియాడారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జిల్లా ప్రొఫైల్ తో పాటు, జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గవర్నర్ కు వివరించారు. జిల్లాలో విద్య, వైద్యం, మహిళా సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల గురించి గవర్నర్ కు వివరించారు. క్షయ రహిత జిల్లా గా తీర్చిదిదేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖఆధ్వర్యంలో చేపట్టిన చర్యలను వివరించారు. అదేవిధంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ మధుమేహ, మిషన్ మధుమేహ దృష్టి కార్యక్రమాలను వాటి లక్ష్యాలను వివరించారు. పీఎం శ్రీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో వంట కోసం చేపట్టిన గ్యాస్ సిలిండర్ కనెక్షన్స్ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష నాయకుల విమర్శలను పట్టించుకోను అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతా..

◆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**అమరచింత డిసెంబర్23, ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని అభివృద్ధి చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకుల మాటలను పట్టించుకోనని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి మక్తల్ నియోజకవర్గం లో ఎన్ని డబుల్ బెడ్ రూములు పేదలకు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడి రెండేళ్ల లో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ఆయన గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో రైతులకు చేసిందేమీ లేదని రైతుల గురించి ప్రతిపక్ష నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని యాసంగి లో వేసుకున్న వరి రైతులకు క్రాప్ హాలిడే నే తొలగించి వారబంధిని ఎత్తివేస్తామని ఆయన అన్నారు. అలాగే అమరచింత మండలంలో గత 50 ఏళ్ల నుండి గ్రామాలకు బీటీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న గత పాలకులు పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం సహాయములో ధర్మాపూర్, నందిమల్ల, మస్తిపూర్ నిధులు కేటాయించి రోడ్లు వేశామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన జూరాల ప్రాజెక్టు దగ్గర మత్స్య సంపద పెంచుకోవడానికి చేపల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. మక్తల్ నియోజకవర్గం భూత్పూర్ చెరువు నుండి లైనింగ్ పనులు చేపడుతున్నామని, అలాగే అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణానికి 16 కోట్ల 22 లక్షల నిధులు మంజూరు అయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు కలిసి పని చేయడం వల్ల మండలంలో సర్పంచులు గెలిచారని వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీవిజయానికి కార్యకర్తలు సైనికుల పనిచేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, ఆత్మకూరు మార్కెట్ డైరెక్టర్ విష్ణు, దేవరకొండ మోహన్, ఆయా గ్రామాల సర్పంచులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్

## బాలికలు విద్యతోపాటు ఆరోగ్య సంరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి

### - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్23 ప్రభాతవార్త:** బాలికలకు విద్యతో పాటు ఆరోగ్యం సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యుక్త వయసులో చెడు అలవాట్లకు బానిస కాకుండా, మంచి జీవితానికి బాటలు వేసుకోవాలని, ఈ వయసులో ఆకర్షణలు సహజంగా ఉంటాయని వాటిని అధిగమిస్తేనే జీవితంలో రాణించడం సాధ్యమవు తుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం విద్యార్థినిల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అమెరికన్ తెలుగు అసోసియేషన్ మరియు మానవతా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన పర్యావరణ హిత శానిటరీ కప్స్ పంపిణీ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఆడపిల్లలు బాల్యం నుంచి యుక్తవయసులోకి అడుగిడే నుండి ఆడపిల్లల్లో రుతుచక్రం ప్రారంభమవుతుందని, ఆడపిల్లల శరీరంలో పలు మార్పులు చోటుచేసుకోవడం సహజం, అయితే ఆ మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వాటి గురించి ప్రతి అమ్మాయి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బాలికల్లో వచ్చే ఈ మార్పులను సరైన అవగాహనతో ఎదుర్కొనేందుకు నాసా కిట్స్ ఎంతో సహాయపడతాయని పేర్కొన్నారు. నాసాకిట్స్ లో శానిటరీ న్యాప్కిన్లు, సబ్బులు, అవసరమైన వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన సామగ్రి ఉండటం వల్ల, రుతుచక్రం సమయంలో పరిశుభ్రత పాటించడంలో ఆడపిల్లలకు మేలు చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. అమ్మాయిలకు పంపిణీ చేస్తున్న నిర్వాహకులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ అమ్మాయిలు చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉండాలని, ఎలాంటి ఇతర అలవాట్లకు ఆకర్షణలకు లోను కాకుండావిద్యపై ప్రత్యేక దృష్టి వహించాలని సూచించారు. అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు జయంత్ చెల్లా మాట్లాడుతూ సమాజంలో బాలికల ఆరోగ్యం విద్య అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలువిరివిగా నిర్వహించడంతోపాటు మెరుగైన సమాజానికి తమవంతు సహాయసహకారాలు అందజేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు ఎకో శానిటరీ కప్స్ వాడకం ఇబ్బందులు తదితర అంశాలపై బాలికలకు మానవతా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రమ్యసౌజన్య అవగాహనకల్పించారు. విద్యార్థినిలు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ముఖ్య అతిథులకు ఎంతగానో ఆకట్టుకు న్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, జిల్లా వైద్యాధికారి రవినాయక్, కేజీబీవీ పర్యవేక్షణ అధికారిని శోభారాణి, తాడూరు మండల విద్యాధికారి త్యాగరాజుగౌడ్, కేజీబీవీ ప్రత్యేక అధికారిని విజయ, ఉపాధ్యాయులు విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## డీకే అరుణమ్మను విమర్శించే స్థాయి కవితకు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మహిళా నాయకులు

**గద్వాల, డిసెంబర్23, ప్రభాతవార్త:** ఎంపీ డీకే అరుణమ్మను విమర్శించే స్థాయి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కు లేదని మాజీ మున్సిపల్ చైర్మన్‌లుటపాలకృష్ణవేణి, బండల పద్మావతిలు ఖండించారు. మంగళవారం స్థానిక డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాదయాత్రతో కెసిఆర్ మెడలు వంచి జిల్లాను సాధించుకున్న మా నాయకురాలు డీకే అరుణ కు ఎంతో ఘనత ఉందన్నారు. లిక్కర్ స్కామ్‌లో కోట్లు దోచుకొని మహిళలకు మాయని మచ్చగా మారవు అని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేసిన డీకే అరుణమ్మను విమర్శించే హక్కు నీకు లేదనీ, గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేసిందన్నారు. తుమ్మిళ్ల ప్రాజెక్టు దగ్గర కుర్చీ వేసుకుని పూర్తి చేస్తానని మీ అయ్యా కేసీఆర్ పూర్తి చేయలేదు ఎందుకని ప్రశ్నించారు. కానీ మా నాయకురాలు నెట్టెంపాడు ప్రాజెక్టుతో రెండు లక్షల ఎకరాలకు నీరు అందించిన ఘనత డీకే అరుణమ్మకు వుందన్నారు. అరుణమ్మ మంత్రిగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు తప్ప గత ప్రభుత్వం ,ప్రస్తుత ప్రభుత్వం ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదనీ, కంకర తేలి రోడ్లు గుంతలమయంగా మారాయి అన్నారు. అక్రమ ఇసుక దందాకు కేరాఫ్ అడ్రస్ గా కల్వకుంట్ల కుటుంబంఉన్నదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేర్లతో అక్రమ ఇసుక దందాకు తెరలేపారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, మహిళ మోర్చా నాయకురాలు ఎం.భారతి, శ్యామల భారతి తదితరులు పాల్గొన్నారు.

## యాసంగిలో కోయిల్ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తాం

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, డిసెంబరు 23 ప్రభాతవార్త:** కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు ఈ ఆసంగిలో 5 విడతలుగా సాగునీరు అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొని, కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ కింద ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే దిశగా జనవరి ఐదో తేదీన నీటిని విడుదల చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజేషన్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించుకుందాం

**వెల్దండ, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** గ్రామంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరించుకుందామని చెర్కూర్ గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు అన్నారు. వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామంలోని కాలనీలను సర్పంచ్ శ్రీనివాసులు పరిశీలించారు. గ్రామంలో తాగునీటి పైప్‌లైనుల లీకేజీలను సర్పంచ్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ గ్రామంలో ప్రథమంగా నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుదామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్, పంచాయతీ కార్యదర్శి హరిణి, సిబ్బంది ఉన్నారు.

## యువకులకు క్రికెట్ కిట్ అందజేత



యువకులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న దృశ్యం

**నవాబుపేట, డిసెంబరు23 ప్రభాతవార్త:** నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ సర్పంచ్ లావుడియా లచ్చి ప్రేమ్ కుమార్‌నాయక్, ఉప సర్పంచ్ తుమ్మల రాజు యాదవ్, ఎన్నికైన సందర్భంగా గ్రామ సర్పంచ్ లావుడియా లచ్చి ప్రేమ్ కుమార్ నాయక్ యువత క్రీడలో ముందుండాలన్న సంకల్పంతో, యువత అడగక ముందే ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే యువకులకు క్రికెట్ కిట్‌ను సొంత నిధులతో గ్రామస్తులతో కలిసి అందించడం జరిగినది. క్రీడల వల్ల శరీర దృఢత్వం పెరుగుతుందని, శక్తి పెరుగుతుందని ఏకాగ్రత ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రేమ్ కుమార్ నాయక్ తోటి యువకులకు ఆదర్శంగా క్రికెట్ కిట్‌ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకులు, పంచాయతీ అధికారులకు మరియు సిబ్బందులకు నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ యువ నాయకులతో శాలువ పూలదండలతో సన్మాన చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**మక్తల్ టౌన్, డిసెంబరు23 ప్రభాతవార్త:** మక్తల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో ఆ గ్రామ ప్రథమ పౌరుడు రవితేజ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నాడు మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి రాజకీయాల కతీతంగా చేయాలని సర్పంచ్‌కి సూచించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కారం చేయడం కోసం తనవంతు కృషి చేయాలని సూచించారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచి రవితేజను గెలిపించినందుకు గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు ఈదమ్మ గుడిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం పూల మాలతో ఘనంగా సన్మానం చేశారు. అంతకుముందు రుద్రసముద్రం గ్రామంలో జరిగిన ఉరుసు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారి వెంబడి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.నరసింహగౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా, ఆయా గ్రామాల నూతన వార్డు సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆర్థిక సాయం

**వెల్దండ, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన అండేకర్ శంకర్‌జీ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ రమేష్ గౌడ్ ద్వారా తెలుసుకొని రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య కరుణాకర్ రెడ్డి ఉప సర్పంచ్ గణేష్ కృష్ణయ్య ఆర్కేగౌడ్ పరమేష్‌గౌడ్ జహంగీర్ రవితో పాటు తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన సర్పంచ్

**వెల్దండ, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** నూతనంగా గెలుపొందిన పోచమ్మ గడ్డ తండాసర్పంచ్ మహిపాల్‌నాయక్ తహసిల్దార్ కార్తీక్ కుమార్‌ను శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా తహసీల్దార్ సర్పంచ్ మహిపాల్‌నాయక్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాలు నాయక్, తదితరులు ఉన్నారు.

